# పచ్చపాలేరు పైత్యదౌత్యం!

**వారం వారం అక్కడ జగన్, ఇక్కడ కేసీఆర్ మీద అక్కసుతో ఆర్కే రాసే చెత్త పలుకులకు బొత్తిగా లాజిక్ ఉండదనే విషయం తాజా చెత్తపలుకు మరోసారి క్లారిటీ ఇచ్చింది. ఆయన కలం పచ్చరంగుకు అంకితమైన విషయం జగద్విదితం. దానికి నిదర్శనంగా ఆ మధ్య బుడ్డోడిని పార్టీ అధ్యక్షుడిని చేయాలని కూడా పచ్చపాలేరు సలహా ఇచ్చేశాడు. ఏ నేపథ్యంలో పుట్టిన పార్టీ? ఎవరిని చూసి జనం జేజేలు పలికారు? ఎలాంటి పిపీలికాన్ని అధినేతగా చేయాలంటున్నాననే స్పృహ ఆ కలానికి ఉండదు. అంతేకాదు.. ఆ కలానికి ఎలాంటి నిలకడా ఉండదు. ఇవాళ రాసిన పలుకు రేపు మారిపోతుంది.**

> *కేసీఆర్ హయాంలో ఫోన్ ట్యాపింగ్ పేరుతో రేవంత్ ప్రభుత్వం ఓ రాజకీయ కుట్రకు తెరలేపింది. దానిపై విచారణ జరుపుతోంది. ఈ కేసు దర్యాప్తు వెనుక అసలు ఉద్దేశం ఏమిటి? ఎవరిని ఇరికించాలనే లక్ష్యంతో సిట్ అధికారులు ప్రయత్నిస్తున్నారనే విషయం తెలంగాణ సమాజానికి తెలుసు. పట్టపగలు నోట్ల కట్టలతో అడ్డంగా దొరికిన పతివ్రతలు చేసే ఆరోపణలు, జరిపించే విచారణల లక్ష్యం ఏమిటో అందరికీ తెలుసు.*

రాజకీయ నాయకులు రంగులు మారుస్తారంటూ పలుమార్లు రాసుకునే ఆర్కే తన కలం ఎన్ని రంగులు మార్చుకుంటుందో మాత్రం గమనించడు. చంద్రబాబు విషయంలో కానీ.. రేవంత్ రెడ్డి వ్యవహారంలో గాని తలెత్తిన వివాదాలపై కొత్త పలుకు విశ్లేషణల్లో ఆర్కే కలం ఎలా వంకర్లు తిరుగుతుందో.. అదే స్థానంలో తనకు గిట్టని వారు ఉంటే ఎలా వక్ర భాష్యం చెబుతుందో చదువరులకందరికీ విదితమే. తాజాగా...'ఫోన్ ట్రాప్‌లో పడేదెవరు?' అనే శీర్షికతో రాసిన పైత్యపు పలుకు ప్రశ్నతో మొదలు పెట్టి తాను కోరుకుంటున్న సమాధానంతో ముగించి, ఎప్పటి మాదిరిగానే తాత్కాలిక పైశాచికానందం పొందింది.

ఆ లక్ష్యం గుట్టును తన పైత్యపు పలుకుల్లో ఆర్కే నగ్నంగా బయటపెట్టేశాడు. 'ప్రభుత్వం జరిపిస్తున్న దర్యాప్తులో ఆధారాలు లభిస్తే రాజకీయంగా కేసీఆర్‌పై ప్రతీకారం తీర్చుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అవకాశం లభిస్తుంది'.. అంటూ లోగుట్టు రట్టు చేశాడు. రేవంత్ అప్రకటిత రాజగురువుగా చలామణి అవుతున్నాడనే ప్రచారం ఉన్న ఆర్కే రాసిన ఈ రాతలతో ఫోన్ ట్యాపింగ్ దర్యాప్తు కేసీఆర్‌పై ప్రతీకార రాజకీయాల్లో భాగంగానే నడుపుతున్నారని బయట పడింది. ఇంతకాలంగా బీఆర్ఎస్ నేతలు వాదిస్తున్నదీ ఇదే. సరే ఈయనకు పచ్చదురద, ప్రభుత్వానికి రాజకీయ కక్ష ఉంటే ఉండవచ్చుగానీ ఏదో సాకుతో ప్రతీకారాలు తీర్చుకోవడానికి ఇది ఆరాచక స్వామ్యం కాదు. వ్యక్తులో పత్రికలో ఉసిగొల్పినంత మాత్రాన మిగిలిన వ్యవస్థలు చేతులు ముడుచుకుని కూర్చోవు. అది సొంత పైత్యాన్ని పత్రికలో రాసుకున్నంత సులువు కాదు.

ఏపీలో జగన్ మీద తిరుమల నెయ్యి పేరిట జరిగిన రాజకీయ వేధింపునకు సుప్రీంకోర్టు మొట్టికాయలతో తెర పడింది. అప్పటిదాకా పేజీలకు పేజీలు నెయ్యి కల్తీ అని నిరూపించేందుకు జబ్బులు పడిపోయేదాక కథలు రాయించిన మీడియా నోరూ పడిపోయింది. పైగా వరంగల్ సభతో ఊపుమీద ఉన్న బీఆర్ఎస్ శ్రేణులు నోట్లో వేలేసుకుని కూర్చోవు. ఆర్కేకో..రేవంత్‌కో కేసీఆర్ పై ప్రతీకారం తీర్చుకోవాలని ఉంటే ఉండవచ్చు. ఏదో చేద్దామనే భ్రమలో ఉండొచ్చు. అంతమాత్రాన అన్నీ జరుగుతాయనుకోవడం వెర్రితనం. అయినా ఓవైపు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సిట్ దర్యాప్తు చేస్తుంటే.. దాన్ని ప్రభావితం చేసే విధంగా, కేసీఆరే ఫోన్ ట్యాపింగ్ చేయించారని నిర్ధారించడం ఏ రకమైన జర్నలిజం? దర్యాప్తు పూర్తి కాక మునుపే కేసీఆర్‌ను దోషిగా చిత్రీకరిస్తున్న కాంగ్రెస్ నేతలకు రాధాకృష్ణకు తేడా ఏమిటి? ఆ మాత్రం దానికి జర్నలిజం అని ముసుగెందుకు? అది తీసేసి, చంద్రబాబు, రేవంత్‌లకు అధికారిక పత్రికగా ఆంధ్రజ్యోతిని ప్రకటించుకోవడం మంచిది.

గతంలో విద్యుత్తు కొనుగోళ్ల విచారణ కమిషన్‌కు సంబంధించిన సమాచారాన్ని ఆర్కే వంటి వారు ఇలా ఓవర్ యాక్షన్ చేస్తూ లీక్ చేయడంతో దర్యాప్తు జరిపే జడ్జియే మారిపోయాడు. కుక్కతోక వంకర అన్నట్టు ఇంకా అదే రీతిలో ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్‌లోనూ అత్యుత్సాహం చూపడం మానలేదు. గమనార్హమైన విషయం ఏమిటంటే..ఫోన్ ట్యాపింగ్ వల్ల వ్యక్తిగత గోప్యతకు భంగం కలుగుతుందని ఆర్కే నీతి వాక్యాలు వల్లె వేశారు. కానీ, 2014-2019 మధ్య చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఏపీలో విచ్చలవిడిగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ఆరోపణలు వచ్చాయి. పెగాసెస్ టెక్నాలజీతో, ఇజ్రాయెల్ నుంచి దిగుమతి చేసిన పరికరాలను ఫోన్ ట్యాపింగ్‌లో వినియోగించారని దర్యాప్తులో నిర్ధారణ కాగా కేంద్ర హోంశాఖ ఏపీలో ఫోన్ ట్యాపింగ్‌పై తీవ్రంగా స్పందించినట్టు వార్తలు వచ్చాయి. వీటిని ధ్రువీకరిస్తూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యలు కూడా చేశారు. 2022 మార్చి 17న పత్రికా సమావేశంలో మమతా బెనర్జీ స్వయంగా చంద్రబాబు ప్రభుత్వం తరపున కొందరు అధికారులు పెగాసిస్ పరికరాలను కొనవలసిందిగా తనకు ప్రతిపాదించారని చేసిన వ్యాఖ్యలు జాతీయ మీడియాలో పెద్ద దుమారం రేపాయి.

-డీఆర్కే రావు

> *చంద్రబాబు ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేయాలని ప్రతిపాదించినప్పుడు ఆంధ్రజ్యోతి ఆర్కేకి వ్యక్తిగత గోప్యతకు భంగం కలుగుతుందనే విషయం గుర్తుకు రాలేదు. అది చట్టబద్ధత్యా నేరం అనే విషయం కూడా మరచిపోయారు. ఆ ఆరోపణలు చంద్రబాబు సర్కారు మీద కాబట్టి. మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యల్లో నిజం ఉందా? అని ఆర్కే ఆనాడు విశ్లేషించే సాహసం చేయలేదు. ఎంతసేపు కేసీఆర్‌ను ఏదో రకంగా ఇరికించాలని ఆరాటపడే ఆర్కే.. ఓటుకు నోటు కేసులో చంద్రబాబు 'మనవాళ్లు బ్రీఫ్‌డ్ మీ' అంటూ అడ్డంగా దొరికిపోయినపుడు బాబుగారిని కాపాడేందుకు ఎంత ఆవేశపడ్డారో తెలంగాణ ప్రజలకు గుర్తుంది.*
>
> రాజకీయాల్లో ఇది సాధారణం.. అంటూ రాసిన రాతలు కూడా గుర్తున్నాయి. ఎందుకంటే అపుడు పచ్చమూకను రక్షించడం ఆర్కేకు ప్రధాన కర్తవ్యమై పోయింది. 'అసలు ఏమీ కాదు. ఎవరూ అరెస్టు కారు..' అంటూ సన్నాయి నొక్కులు నొక్కారు. నాలుక ఇటు తిప్పి ఒక మాట.. అటు తిప్పి ఒక మాట మాట్లాడడం రాజకీయ ఊసరవెల్లులకు అలవాటు. ఇపుడు జర్నలిజంలో అలాంటి ఊసరవెల్లిని చూస్తున్నాం.

ఎన్టీఆర్ మార్గ్ వద్ద జరుగుతున్న మరమ్మతులు

## లోకేశ్ ఆగ్రహం... రేవంత్ జీ హుజూర్!

### హెచ్ఎండీఏ నిధులతో ఎన్టీఆర్ ఘాట్ మరమ్మతులు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 22 (నమస్తే తెలంగాణ): ఏపీ మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తంచేస్తే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించిన ఓ ఉదంతం చర్చనీయాంశంగా మారింది. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద కట్టడాలు దెబ్బతిన్నాయని, మరమ్మతులు ఎందుకు చేయలేదని, ప్రభుత్వ నిధులతోనే మరమ్మతులు చేయాలని లోకేశ్ గతంలో ఓ పోస్ట్ పెట్టారు. తాజాగా స్పందించిన రేవంత్‌రెడ్డి ఆదేశించడంతో హెచ్ఎండీఏ రూ.1.3 కోట్లు మంజూరు చేసింది. దీంతో అధికారులు హడావుడిగా పనులు చేపట్టారు. ఈ పరిణామాలపై సోషల్ మీడియాలో తెలంగాణవాదుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. రైతుబీమా ప్రీమియం చెల్లించకుండా కాలయాపన చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. లోకేశ్‌కు కోపం రాగానే ప్రజాధనాన్ని ఎలా మంజూరు చేశారని నెటిజన్లు మండిపడుతున్నారు.

## గ్రూప్-1 నియామక పత్రాలు ఎప్పుడిస్తరు?

- తీవ్రజాప్యంతో కుంగిపోతున్నాం
- నిరాశ పరుస్తున్న సర్కార్ చర్యలు
- ఆందోళనలో కుటుంబ సభ్యులు
- ప్రభుత్వం మా మొర ఆలకించాలి
- గ్రూప్-1 అభ్యర్థుల వేడుకోలు

సమావేశంలో మాట్లాడుతున్న గ్రూప్ 1 అభ్యర్థులు

ఖైరతాబాద్, జూన్ 22: ఎన్నో ఆశలు, ఆశయాలతో కష్టపడి చదివి గ్రూప్-1లో ర్యాంకు సాధించాం.. కానీ, నియామక పత్రాలు ఇవ్వకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తున్నది.. అసలు ఎప్పుడిస్తరు? అని టీజీపీఎస్సీ గ్రూప్-1 సెలెక్టెడ్ అభ్యర్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మీడియా సమావేశంలో పలువురు అభ్యర్థులు తమ అవేదనను వెలిబుచ్చారు. అభ్యర్థులు నిషాంత్, రంజిత్, సందీప్‌కుమార్, వేద మాట్లాడుతూ టీజీపీఎస్సీ ద్వారా నిర్వహించిన గ్రూప్-1 పరీక్షలో ర్యాంకులు సాధించి ఉద్యోగాలకు అర్హత సాధించామని తెలిపారు. 583 మంది అభ్యర్థులు నియామకపత్రాల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది మార్చి 30న జనరల్ ర్యాంకింగ్ లిస్టును టీజీపీఎస్సీ విడుదల చేసిందని, అనంతరం సర్టిఫికెట్ వెరిఫికేషన్, వైద్య పరీక్షలు తదితర ప్రక్రియలు పూర్తయ్యాయని వివరించారు. నియామకాలు చివరి దశకు చేరుకున్నాయని, గ్రూప్-1 అధికారులుగా విధుల్లో చేరేందుకు సన్నద్ధంగా ఉన్న తాము నియామక పత్రాలు అందుకోవాల్సి ఉండగా, ప్రభుత్వ చర్యలు నిరాశపరిచాయని ఆవేదన వ్యక్తంచేశారు. నియామకాల విషయంలో ఎటూ తేలకపోవడంతో తమ తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. ఉద్యోగ విధుల్లో చేరాలనుకున్న తమ లక్ష్యానికి నియామకపత్రాల ఆలస్యం.. మానసిక ఆందోళనకు గురిచేస్తున్నదని, ప్రభుత్వం ఇప్పటికైనా కనికరించి నియామకపత్రాలు అందించాలని కోరారు.

### మాది వ్యవసాయ కుటుంబం

మా నాన్న రవీందర్ రైతు. మా కుటుంబానికి వ్యవసాయమే జీవనాధారం. గ్రూప్-1లో అర్హత సాధించడానికి గత మూడేండ్లు కష్టపడి చదివా. అశోక్‌నగర్‌లో కిరాయి రూమ్‌లో ఉంటూ పరీక్షలకు సన్నద్ధమయ్యాను. ఎంతో కష్టపడి చదివి గ్రూప్-1 సాధిస్తే ప్రభుత్వ చర్య బాధ కలిగించింది.

- శివకుమార్, కరీంనగర్

### నాన్న సంపాదనే మాకు ఆధారం

మాది నారాయణపేట. మా నాన్న శ్రీనివాస్ ఆర్టీసీ బస్ కండక్టర్. చిన్నప్పటి నుంచి ఎంతో కష్టపడి చదివాను. నాన్న సంపాదనపైనే మా కుటుంబం ఆధారపడింది. గ్రూప్-1లో అత్యుత్తమ ర్యాంకు వచ్చింది. డిప్యూటీ కలెక్టర్ కావాలన్నది నా జీవితాశయం. ప్రభుత్వం కనికరించి నియామక పత్రం అందజేయాలి.

- ఎస్ వీణ, సెలెక్టెడ్ అభ్యర్థి

డాక్టర్ రామన్‌దేవిక దంపతులకు రశీదు అందజేస్తున్న ఈవో అన్నపూర్ణ

## 'మల్లన్న' క్షేత్రానికి 15 లక్షల విరాళం

- త్వరలో కాటేజీల నిర్మాణాలు
- ఆలయ ఈవో అన్నపూర్ణ

చేర్యాల, జూన్ 22 : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి శ్రీ మల్లికార్జునస్వామి క్షేత్రంలో భక్తుల వసతుల కోసం 100 కాటేజీలు నిర్మించేందుకు ప్రారంభించిన డోనర్ స్కీంకు దాతల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని ఈవో అన్నపూర్ణ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ బొడ్డుల రామన్‌దేవిక దంపతులు 100 కాటేజీలలో ఒక్క కాటేజీ నిర్మాణం కోసం రూ.15 లక్షల విరాళాన్ని ఆదివారం ఆలయంలో ఈవోకు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ కాటేజీల నిర్మాణం కోసం ఇప్పటి వరకు దాతల నుంచి రూ.95 లక్షలు విరాళంగా అందినట్టు తెలిపారు. విరాళాలు సేకరించేందుకు ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. మరిన్ని విరాళాలు రాగానే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. దాత డాక్టర్ రామన్ మాట్లాడుతూ 45 సంవత్సరాల నుంచి దేవాలయానికి వస్తున్నానని, ఇలవేల్పు క్షేత్రంలో కాటేజీ నిర్మించేందుకు అవకాశం రావడం సంతోషంగా ఉందని చెప్పారు. డాక్టర్ రామన్‌దేవిక దంపతులకు అర్చకులు స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఏఈవో బుద్ది శ్రీనివాస్, పర్యవేక్షకులు సురేందర్‌రెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## దాబాడీ

*పొదుపు అనేది ప్రతీ ఒక్కరికీ తప్పక ఉండాల్సిన లక్షణం. అయితే దాన్ని ఏ వయసులో ఎలా అనుసరించాలో కొద్దిమందికే తెలుసు. మరి నిపుణుల సలహాలేమిటో చూసేద్దాం పదండి.*

# ట్యాక్స్‌పేయర్స్.. ఇది తెలుసా!

**హెచ్ఆర్ఏ, సెక్షన్ 80సీ, 24బీ క్లెయిమ్‌లు కఠినతరం**

**పాత పన్ను విధానం ఎంపికదారులపై కొత్త ఐటీఆర్ నిబంధనలు**

## ఏ వయసులో ఎంత పొదుపు?

**20ల్లో మొదలు**

20 ఏండ్ల వయసులోనే పొదుపునకు శ్రీకారం చుట్టాలి. మీ సేవింగ్స్‌కు పునాది పడేది ఈ వయసులోనే. కాబట్టి కేవలం రూ.500తో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్)ను ప్రారంభించినా కొంతకాలం తర్వాత దానివల్ల అందుకొనే లాభం పెద్ద మొత్తంలోనే ఉంటుందని మరువద్దు.

**30ల్లో జీతానికి సమానంగా..**

30 ఏండ్ల వయసులో మీరు ఏదో ఓ ఉద్యోగం చేస్తూనే ఉంటారు. కనుక మీ వార్షిక ఆదాయానికి సమానంగా పొదుపు మొదలు పెట్టండి. ఇందుకు ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్), పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్), మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్)ను వినియోగించుకోండి.

**40ల్లో ప్రాధాన్యతలు**

40 ఏండ్ల వయసుకు రాగానే ప్రతీ ఒక్కరికీ తమతమ జీవితాల్లో ప్రాధాన్యతలు మారిపోతూ ఉంటాయి. పిల్లల చదువు, మీ పదవీ విరమణ అనంతర జీవితం, భవిష్యత్తులో అనారోగ్య సంబంధిత వ్యయాలకు పెద్దపీట వేయాల్సి ఉంటుంది. కాబట్టి వీటికి తగ్గట్టుగా పెట్టుబడులను పెంచుకుంటూ పోవాలి. అలాగే రుణ భారాన్ని అదుపులో కూడా ఉంచుకోవాలి.

**50ల్లో లక్ష్యాలపై గురి**

వయసు 50 ఏండ్లు దాటిందంటే రిటైర్మెంట్ జీవితంపై దృష్టి పెట్టాలి. ఇప్పటిదాకా చేసిన సేవింగ్స్‌ను, ఇన్వెస్ట్‌మెంట్లను స్థిరంగా కొనసాగిస్తూ 60 ఏండ్లకు ఆ సొమ్ము మీ అవసరాలకు అందివచ్చేలా ఉండాలి. పరిమిత ఖర్చులతో ఆర్థిక క్రమశిక్షణను పాటించాలి.

**60ల్లో సురక్షితంగా..**

60 ఏండ్లు దాటిన తర్వాత అందరికీ ఆదాయ మార్గాలు మూసుకుపోతాయి. అప్పటిదాకా మనం చేసిన సేవింగ్స్, పెట్టుబడులే మనకు ఆధారం. అయితే ఈ వయసులోనూ సురక్షిత పెట్టుబడులకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకెళ్లవచ్చు. అందుకు సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీం (ఎస్‌సీఎస్ఎస్), యాన్యుటీలు లేదా సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ) వంటివి ఉన్నాయి. కొన్ని బ్యాంకులు డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు ఎక్కువ వడ్డీ కూడా ఇస్తూ ఉంటాయి.

**చివరగా..**

అన్నింటికంటే ముఖ్యంగా సమగ్ర ఆరోగ్య బీమా ఉండాలన్నది గుర్తుంచుకోవాలి. కాబట్టి ముందు నుంచే సేవింగ్స్, ఇన్వెస్ట్‌మెంట్స్‌తోపాటు హెల్త్ ఇన్సూరెన్స్‌కూ పెద్దపీట వేయాలి. అప్పుడే ముదిమి వయసులో ఎవరి మీదా ఆధారపడకుండా స్వేచ్ఛగా జీవించవచ్చు.

పెద్దపీట వేయాల్సిన అంశాలు

**ఆదాయ** పన్ను రిటర్న్స్ (ఐటీఆర్) దాఖలుకు సంబంధించి దేశంలో పన్ను చెల్లింపుదారులకు కొత్త, పాత పన్ను విధానాలు అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే. పాత పన్ను విధానానికి అంతా గుడ్‌బై చెప్పేలా చేయాలని కేవలం కొత్త పన్ను విధానాన్ని కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు ఏటేటా బడ్జెట్‌లో ఆకర్షణీయంగా మారుస్తున్న సంగతీ విదితమే. ఈ క్రమంలోనే ఈ ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఈ ఏడాది ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వార్షిక ఆదాయంపై పన్ను మినహాయింపు పరిమితుల్ని గణనీయంగా పెంచారు. అయినప్పటికీ ఇంకా కొందరు ట్యాక్స్‌పేయర్స్ పాత పన్ను విధానంలోనే తమ ఐటీఆర్‌లను దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. అయితే 2024-25 ఆర్థిక సంవత్సరానికి (2025-26 మదింపు సంవత్సరం) సంబంధించి ఇప్పుడు ఐటీఆర్‌లు దాఖలుచేసేవారు పాత పన్ను విధానాన్ని ఎంచుకుంటే వివిధ క్లెయిమ్‌ల కోసం కఠిన నిబంధనల్నే ఎదుర్కోవాల్సి వస్తుంది. పన్ను మినహాయింపుల కోసం సవివరంగా సమాచారం ఇవ్వాలని కొత్త నిబంధనలు చెప్తున్నాయి మరి.

**ఇదీ సంగతి..**

ఐటీఆర్‌లకు సంబంధించి ఆదాయ పన్ను (ఐటీ) శాఖ నిబంధనల్ని మరింత కఠినతరం చేసింది. పన్ను మినహాయింపుల కోసం చేసే క్లెయిములపై నిఘా పెంచింది. ఇందులోభాగంగానే తప్పుడు క్లెయిములకు కళ్లెం వేసేలా చర్యలు చేపట్టింది. అంతేగాక తప్పులు లేకుండా ఐటీ రిటర్న్స్ ప్రక్రియను వేగవంతం చేయడానికి వెరిఫికేషన్ ప్రక్రియను ఆటోమెటిక్ చేసింది. మరోవైపు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఐటీఆర్ దాఖలుకున్న గడువును ఈ ఏడాది సెప్టెంబర్ 15దాకా పొడిగించింది. సెక్షన్ 80సీ, 80డీ, 24బీ వంటి వాటికింద పన్ను మినహాయింపులను కోరేవారు అందుకు కావాల్సిన అన్ని ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలనే ఈ పొడిగింపు. దీంతో పాత పన్ను విధానంలో పన్ను మినహాయింపులను క్లెయిమ్ చేసుకోవాలనుకొనే ట్యాక్స్‌పేయర్స్ ముందే డాక్యుమెంట్లను సరిచూసుకోవడం చాలాచాలా అవసరం. లేకపోతే పన్ను పోటు తప్పదని ఆర్థిక నిపుణులు కూడా చెప్తున్నారు.

- ఐటీ చట్టంలోని సెక్షన్ 24బీ కింద గృహ రుణాలపై వడ్డీ చెల్లింపుల వంటి వాటికి పన్ను మినహాయింపులను కోరేవారు.. రుణం తీసుకున్న బ్యాంక్ లేదా బ్యాంకింగేతర సంస్థ పేరు, లోన్ అకౌంట్ నెంబర్, రుణం మంజూరైన తేదీ, పొందిన మొత్తం రుణం, ఇంకా మిగిలిన బకాయి తదితర వివరాలను సమర్పించాల్సిందే.
- సెక్షన్ 80డీ కింద ఆరోగ్య బీమా క్లెయిములకు బీమా సంస్థ పేరు, పాలసీ నెంబర్ వివరాలు ఇవ్వాలి. ఒకవేళ సెక్షన్ 80డీడీబీ కింద తీవ్ర అనారోగ్య సమస్యల్ని చూపుతూ పన్ను మినహాయింపులను పొందాలనుకుంటే సంబంధించిన వ్యాధి పూర్తి వివరాలనూ అందించాలి.
- పన్ను చెల్లింపుల్లో ఇంటి అద్దె అలెవెన్స్ (హెచ్ఆర్ఏ) మినహాయింపుల కోసం ట్యాక్స్‌పేయర్స్ వారి వేతన వివరాలు, చెల్లిస్తున్న అద్దె, ఉద్యోగం చేస్తున్న సంస్థ వివరాలు ఇవ్వాలి.
- గతంలో కొందరు పన్ను చెల్లింపుదారులు ఒకే నగరంలో సొంతిల్లు ఉన్నదని, అద్దెకు ఉంటున్నామని చెప్తూ హెచ్ఆర్ఏ, గృహ రుణ వడ్డీరేటు మినహాయింపులకు క్లెయిమ్ చేసినట్టు ఐటీ శాఖ గుర్తుచేస్తున్నది. కొత్త నిబంధనల ప్రకారం అలాంటి క్లెయిమ్‌లను నిశితంగా గమనిస్తారు.
- విద్యా రుణాలు, లోన్‌పై విద్యుత్తు ఆధారిత వాహనాల కొనుగోళ్లు వంటి వాటికి సంబంధించీ పూర్తి వివరాలను అందించాల్సి ఉంటుంది. దీనివల్ల అనర్హులను గుర్తించవచ్చని తప్పుడు క్లెయిమ్‌లకూ చెక్ పెట్టవచ్చని భావిస్తున్నారు.
- పన్ను మినహాయింపుల కోసం ట్యాక్స్‌పేయర్స్ సమర్పించిన డాటాను పాన్, ఆధార్ సాయంతో థర్డ్-పార్టీ డాటాబేసెస్‌తో అధికారులు పునఃపరిశీలిస్తారు. ఈ నేపథ్యంలోనే బీమా సంస్థలు, బ్యాంకులు, ఇతర ప్రభుత్వ రికార్డుల నుంచి సమాచారాన్ని సేకరించి అసలు ఆదాయంపై నిజానిజాలను తేలుస్తారు.

### ఫామ్ 16లో మార్పులు

మదింపు సంవత్సరం 2025-26 కోసం ఉద్యోగులు తీసుకునే తమ ఫామ్ 16లో పలు మార్పులు చోటుచేసుకోబోతున్నాయి. వేతనాలు, వాటిలోని కోతలు, పన్ను మినహాయింపులకు సంబంధించిన మరింత సమాచారంతో ఇది ఉండనున్నది. వ్యక్తిగత ఆదాయ పన్ను రిటర్న్స్‌ను దాఖలు చేసేవారికి ఫామ్ 16 తప్పనిసరి.

- ఒకే ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగులు ఎన్ని ఉద్యోగాలు మారితే అన్ని సంస్థల నుంచి ఫామ్ 16లను తీసుకోవాల్సిందే.
- ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) వడ్డీరేటు, విదేశీ ప్రయాణ ఖర్చులు తదితర నిర్దిష్ట వివరాలపై ట్యాక్స్ కలెక్షన్ ఎట్ సోర్స్ (టీసీఎస్)తోపాటు ఇతర ఆదాయ వనరుల నుంచి ట్యాక్స్ డిడక్షన్ ఎట్ సోర్స్ (టీడీఎస్) కూడా ఫామ్ 16లో కనిపించనున్నది. అయితే 12బీబీఏ ఫామ్ ద్వారా యాజమాన్యానికి సదరు సమాచారం ఉద్యోగి అందిస్తేనే ఇవి ఉంటాయి.
- పెంచిన స్టాండర్డ్ డిడక్షన్ పరిమితి ప్రకారం ఉంటుంది. ఈసారి బడ్జెట్‌లో రూ.50వేల నుంచి 75వేలకు పెంచిన విషయం తెలిసిందే.
- ఉద్యోగి నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) ఖాతాకు కంపెనీ నుంచి 14 శాతం విరాళం అందితే సెక్షన్ 80సీసీడీ(2) కింద బేసిక్ సాలరీలో 14 శాతం పన్ను ప్రయోజనం సదరు ఉద్యోగికి అందుబాటులో ఉంటుంది. ఇది కొత్త పన్ను విధానంలోనే ఉంటుంది.
- ఐటీ శాఖ ఆన్‌లైన్ వేదిక టీఆర్‌ఏసీఈఎస్ పోర్టల్ ద్వారా ఫామ్ 16ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఉద్యోగులు తమ పాన్ కార్డు వివరాలతో లాగిన్ కావచ్చు. ఆ తర్వాత ఫామ్ 16 పార్ట్ ఏ, బీలను డౌన్‌లోడ్ చేసుకుని ఐటీఆర్‌లను దాఖలు చేయవచ్చు.

## ఊగిసలాటలో సూచీలు!

**తీవ్ర** ఒడిదొడుకుల నడుమ దేశీయ స్టాక్ మార్కెట్లు గత వారం లాభాలనే అందుకున్నాయి. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు, గ్లోబల్ మార్కెట్‌లో పెరుగుతున్న ముడి చమురు ధరలు.. భారతీయ స్టాక్ మార్కెట్లను ప్రభావితం చేసినప్పటికీ మదుపరులు వారాంతంలో కొనుగోళ్లతో మద్దతు పలికారు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,289.57 పాయింట్లు ఎగిసి 82,408.17 వద్ద నిలిచింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 393.80 పాయింట్లు ఎగబాకి 25,112.40 దగ్గర స్థిరపడింది. అయితే ఈ వారం పశ్చిమాసియా దేశాల్లోని ఉద్రిక్తతలు మరింత పెరిగితే ఆ ప్రభావం దేశీయ ఈక్విటీలపై స్పష్టంగా ఉంటుందని చెప్పవచ్చు. ముఖ్యంగా ముడి చమురు ధరలు విజృంభిస్తే.. ఆయిల్-గ్యాస్ రంగాలతోపాటు రవాణా, బ్యాంకింగ్, ఆటో, నిర్మాణ తదితర రంగాల షేర్ల కదలికలు కీలకంగా మారనున్నాయి. ఇక ఎప్పట్లాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు, దేశీయ మార్కెట్లను నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 24,700 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,500 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. కానీ సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 25,400-25,600 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.




*బ్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.*

**గమనిక..**

*స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు*